# జాతకాలు

## -వారణాసి రామకృష్ణ

కారు వేగంగా రాజ్‌దూత్ హోటల్ ముందు ఆగింది. వెనుకసీటు తలుపు తీసుకుంటూ కోపంగా వ్యాపార మూర్తి కిందికి దిగాడు. అనేకమందిని అనేకవిధాలుగా కొల్లగొట్టి బాగా నల్లడబ్బు పోగేసిన వ్యాపారమూర్తి నిప్పులు చెరుగుతూ హోటల్ మెట్లెక్కుతున్నాడు.

అతని జేబులో ఓ చిన్న పత్రికా ప్రకటన.. అందులో- మీ అదృష్టాన్ని పరీక్షించదలుచుకున్నారా? అన్న శీర్షిక క్రింద.. గొప్ప జ్యోతిష్య పండితుడు, నాడీజ్ఞాన సంపన్నుడు దేవీ ఉపాసకులైన శ్రీశ్రీశ్రీ గజేంద్ర మహరాజ్‌గారి అపాయింట్‌మెంట్ కొరకు వెంటనే సంప్రదించండి! మీ ఉజ్వల భవిష్యత్తు, వృత్తి విజయాలు, ఉద్యోగ, విదేశీ యానాల కొరకు వెంటనే ప్రయత్నించండి! రూమ్.నెం.106 రాజ్‌దూత్ హోటల్ అని ఫోన్ నెంబరులతో సహా చిరునామా ఉంది.

వ్యాపారమూర్తి బోలెడంత ఖర్చుచేసి గజేంద్రమహరాజ్ అపాయింట్‌మెంట్ పొంది ఆయన సలహా ప్రకారం పాతిక లక్షలు పోసి ఊరికి తూర్పువైపున్న భూమిని కొనుగోలు చేశాడు. అయితే ఆ భూమి పనికిరానిదని పైసాకు కొరగాని పోరంబోకని తన పెట్టుబడి అంతా శుద్ధ దండగేనని తేలింది. పైగా భూమి తాలూకూ పత్రాలు సరైనవి కావనీ ఈ మోసం వెనక గజేంద్రమహరాజ్ హస్తం ఉందనీ ఆలస్యంగా తెలిసింది. దాంతో ఆగ్రహోదగ్రుడై హోటల్‌కి బయల్దేరాడు.

అది హోటల్‌గది అనేకన్నా విశాలమైన హాలు! ఏ.సి. అవటం మూలాన హాలంతా చాలా చల్లగా సౌకర్యంగా ఉంది. నేలమీద మెత్తని తివాచీలు..స్పాంజి సోఫాలు.. ఖరీదయిన ల్యాంప్‌షెడ్స్! వీటికి అభిముఖంగా ఎత్తయిన వేదిక..వేదిక మీద ధగధగలాడుతున్న గద్దె! జ్యోతిష్కుడు ఆశీనుడవడానికే ప్రత్యేకంగా దాన్ని తయారుచేశారు. చండప్రచండ కోపంతో లోనికెళ్ళిన వ్యాపారమూర్తి గద్దెమీద ఆశీనులైన జ్యోతిష్కుడ్ని చూసి ఒక్కక్షణం నివ్వెరపోయాడు.

మంచి పసుపురంగు ఛాయ..ఆరడుగుల ఎత్తు. ఎర్రని పెదవులు మొహంలో దరహాసం..వదనంలో ప్రశాంతత! నుదుటిమీద పెద్ద రూపాయి బిళ్ళంత బొట్టు! ఆమెని చూడగానే ఎవ్వరికైనా అప్రయత్నంగా రెండు చేతులు ఎత్తి దండం పెట్టాలనిపిస్తుంది. వ్యాపారమూర్తి అప్రయత్నంగా చేతులు జోడించి ఆలోచనలో పడ్డాడు.

క్రిందటిసారి తాను వచ్చినపుడు ఉన్న జ్యోతిష్కుడు పొట్టిగా నల్లగా గుబురుగడ్డం, మెరుసే కళ్ళు.. అయితే ఇప్పుడా జ్యోతిష్కుడేమైనట్టు?

కాలుతున్న నిప్పురవ్వ మీద నీళ్ళు పడ్డట్టు వ్యాపారమూర్తి ఒక్కసారిగా డీలాపడ్డాడు. వచ్చినంత వేగంగా తిరిగి వెళ్ళబోతున్నంతలోనే-

''నాయనా మూర్తీ'' అన్న స్వరం విని ఆశ్చర్యంతో ఆగిపోయాడు. అది ఖచ్చితంగా స్త్రీ స్వరం లాగా లేదు. అలాగని పురుషుని స్వరం అస్సలు కాదు. ఆ గొంతు అదోలాగా ఉంది. అయినా ఆకర్షించేలా ఉంది. ఒక్కసారి ఆమె వంక చూశాడు. మృదుమధురంగా నవ్వింది. సమ్మోహనంగా ఉంది ఆమె. యజమాని పిలుపువిని కుక్క తోక ఆడిస్తూ దగ్గరికి పరుగెత్తినట్టుగా వ్యాపారమూర్తి ఆమె పాదాల దగ్గరకి చేరాడు.

''తమరు..?'' సంశయంగా ఆగాడు..సమాధానంగా ఆమె-

''త్రికాల త్రివేణీ జగన్మోహినీమాత నా నామధేయం!'' చిద్విలాసంగా చెప్పింది.

''మాతా! మోసపోయాను! పెట్టుబడి అంతా బూడిదయ్యింది!'' బావురుమన్నాడు.

''బాధపడకు నాయనా! అంతా మంచి జరుగుతుంది!''

''ఇంకేం మంచి.. అంతా ముంచి పోయాడు! పైగా ఆరోజు మాటల మధ్యలో నువ్వా స్థలం కొంటే ప్రక్కనే బీచ్ కూడా వస్తుంది అన్నాడు. ఏదో ఆదుర్దాలో ఉండి పట్టించుకోలేదు కానీ మరీ ఇంత మోసమా? ఈ ఊళ్ళో సముద్రమే లేదు... బీచ్ ఎలా వస్తుంది?''

''చూడు భక్తా! ఆవేశంలో మరొకరిని నిందించేకంటే నిన్ను నువ్వు తెలుసుకో! వాడు ఆరోజున చెప్పింది 'బీచ్‌మే ఎయిర్‌పోర్టు ఆయేగా' అని- నువ్వేమో బీచ్..పోర్టు, ఈమాటలు గుర్తుంచుకుని వేరుగా అర్థం చేసుకున్నావు? వాడు చెప్పింది తెలుగు బీచి కాదు హిందీ బీచి.. అంటే..''

''మధ్యలో అని అర్థం తెలుసును మాతా! కానీ మీరా సమయంలో ఇక్కడ లేనే లేరు..''

''అర్థం చేసుకోనాయనా! త్రికాలజ్ఞులం! సర్వకాల సర్వావస్థల్లోనూ ఉంటాం! నీ జాతకం ప్రకారం అంతా అలా జరగాల్సి ఉంది''

''ఇంకా ఎన్నో మాయమాటలు చెప్పాడు మాతా! ఆ భూమి కొన్న వెంటనే అందులో సువర్ణగని పడుతుంది అని! గని పడలేదు..నాకు శని పట్టింది!''

''నిజమే చెప్పాడు భక్తా! జాతక ప్రకారం నువ్వా భూమి కొనుగోలు చెయ్యాలి.. ఆపైన నీకు శని పట్టాలి!''

''అసలు నేనే అమాయకుడ్ని! వొట్టి పోరంబోకును! పోరంబోకు భూమి కొన్నాను!''

''అవును భక్తా! జాతక ప్రకారం బుధభుక్తిలో కేతువు నడుస్తోంది! ఆ సమయంలో ఒకరు చెప్పింది నువ్వు నమ్ముతావు.''

''భవిష్యత్తులో నీకు తిరుగులేదనీ రాజకీయాల్లో రాణించి దేశాన్నేలుతావనీ చెప్పాడు! కానీ ఇలా జరిగిందేమిటి మాతా?''

''అలా జరగాలనే రాసుంది భక్తా!''

''అంటే..''

''దైవాజ్ఞచే అతను ఆ జాతకాన్ని అలా చెప్పాల్సి వచ్చింది భక్తా!''

''అంటే..ఆరోజున ఆయన చెప్పింది''

''అక్షరాలా నిజం! నీ జాతకం ప్రకారం నువ్వు ఆ జ్యోతిష్కుడి చేతిలో అలా మోసపోవాలని రాసిపెట్టి ఉంది.''

''నిజమా మాతా!''

''అవును భక్తా! జాతక ప్రకారం నీ ఆయనాంశ ఇరవైమూడు డిగ్రీలుంది. కానీ వాస్తవంగా నీది పదిహేడు డిగ్రీల ఆయనాంశ!''

''అయితే ఏంటి మాతా?''

''దీని మూలాన యోగం మారింది భక్తా!''

''మరిప్పుడా యోగాన్ని ఎలా మార్చాలి మాతా?''

''మరో కొత్త జాతకం రాయాలి భక్తా!''

''కొత్తజాతకమా?''

''అవును! పాతది రాసిన వాడు అజ్ఞాని! దాన్ని తగలేస్తే కానీ నీకు పట్టిన గ్రహదోషం పోదు!''

''పాతదాన్ని రాసినందుకు గజేంద్ర మహరాజ్ పదివేలు తీసుకున్నాడు.''

''చెప్పాగా..వాడొట్టి చవట! పదివేలే తీసుకుని పొరబాటు చేశాడు.''

''మరి జాతకాన్ని తిరగరాయటానికయ్యే

ఖర్చెంత మాతా!''

''పాతిక వేలు భక్తా!''

''తప్పదా మాతా?''

''తిప్పలు తప్పాలనుకుంటే తప్పదు భక్తా!''

''పాతిక వేలతోనే పట్టిన శని పోతుందా మాతా?''

''అంత త్వరగా పోదు భక్తా! పైగా నువ్వు లక్షవొత్తుల నోము చెయ్యాలి! చండియాగం జరపాలి! హోమంలోకి నూటొక్క కిలోల నెయ్యి వాడాలి! హోమాగ్ని ధూపాన్ని నుదుట నిత్యం రాసుకుని కటికి నేలమీద నెల్లాళ్ళు నిద్రించాలి..''

''ఈ తతంగం పూర్తయ్యాక నా జాతకం మారిపోతుందా మాతా?''

''దేహంలో సందేహాలకి తావివ్వకూడదు భక్తా!''

పులిలాంటి వ్యాపారమూర్తి పిల్లిలా వెనుదిరిగి వెళ్ళిపోయాడు.

అతడు వెళ్ళాక. జగన్మోహినీమాత ''వత్సా'' అని కేకవేశారు. లోపల గదిలో మంచాలు శుభ్రం చేస్తున్న రూమ్‌బాయ్ వచ్చి-

''చెప్పండి మాతా!'' అన్నాడు వినయంగా.

''బైటికెళ్ళి ఇంకా ఎవరైనా భక్తులొస్తున్నారేమో చూడు''

బాల్కనీలో నిలబడి రూమ్‌బాయ్ కాసేపుతర్వాత లోనికొచ్చాడు.

''ఎవరో ఇద్దరు వస్తున్నారు మాతా'' చెప్పాడు.

''ఎలా ఉన్నారు?''

''వాళ్ళ ముఖకవళికల్ని బట్టి చాలా ఆనందంగా ఉషారుగా జీపు దిగారు మాతా!''

''అంటే కొత్త భక్తులన్నమాట!'' ఒక్కక్షణం బరువుగా ఊపిరి పీల్చింది.



''అలసిపోయారా? కాస్త తమరు విశ్రాంతి తీసుకోండి''

''ఊ..మరి నువ్వు..''

''కొత్తవాళ్ళే కదా..కంగారులేదు! యధాప్రకారం తంతుకొనసాగిద్దాం!'' అంటూ రూమ్ బాయ్ క్షణంలోనే శ్రీశ్రీశ్రీ గజేంద్ర మహరాజ్ అవతారం ఎత్తేడు.

లోపలి గదికెళ్ళిన జగన్మోహినీమాత అంతే వేగంగా జగన్మోహన్ అనే రూమ్‌బాయ్ వేషంలోకి పరకాయ ప్రవేశం చేసింది!

బాటిల్ ఓపెన్ చేసి సీసాలోని ద్రవాన్ని ఒక్క ఉదుటున త్రాగేసి, కాస్తంత రిలాక్స్ అవుతుండగానే- కళ్ళు బైర్లు కమ్మాయి.

ఆ గదిలోకి దూసుకొచ్చిన ఇద్దరు..క్షణంలో నలుగురై ఒక్కసారిగా కనిపించారు. వాళ్ళ చేతుల్లో లాఠీలున్నాయి. నెత్తిమీద సింహం బొమ్మలున్న టోపీలు..కాస్తదూరంగా గజేంద్ర మహరాజ్ కరచరణాలకి కొత్తగా మెరుస్తున్న ఉక్కు సంకెళ్ళు! పరిస్థితి అర్థం అయి అవనంతలోనే, అందరికీ భవిష్యత్తు చెప్పే ఆ ఇద్దరి జాతకాలూ, క్షణంలో మారిపోయాయి!

★